క్లుప్తంగా

3న మండల మీట్

రొంపిచెర్ల: ఈనెల 3న రొంపిచెర్ల మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ రెడ్డెప్పచ్చారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతనెల 4న రొంపిచెర్ల మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. అయితే కోరం లేక మండల సమావేశం రద్దు చేశారు. దీంతో మళ్లీ ఈనెల 3న మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు, అన్ని శాఖల మండల అధికారులు పాల్గొనాలని కోరారు.

కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే



కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విజయ్‌చంద్ర

బైరెడ్డిపల్లె: మండలంలోని నెల్లిపట్ల సచివాలయ పరిధిలోని గ్రామాల్లో బుధవారం బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌చంద్ర ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది కుష్టువ్యాధిపై ఇంటింటి సర్వే చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ శరీరంపై నొప్పి, స్పర్శలేని మచ్చలు, రాగి రంగుగల మచ్చలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కుష్టు వ్యాధి పట్ల ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కుష్టువ్యాధి పట్ల నిర్లక్ష్యం వహిస్తే అంగవైకల్యం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

రొంపిచెర్ల: రొంపిచెర్ల ఇన్‌చార్జ్ ఏపీఎంగా హరినాథ్ బాధ్యతలు స్వీకరించినట్లు బుధవారం తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న ఏపీఎం బ్రహ్మానందరెడ్డి జూన్‌లో ఉద్యోగ విరమణ చెందారు. దీంతో సదుం క్లస్టర్ ఏపీఎంగా ఉన్న హరినాథ్‌కు ఇన్‌చార్జ్ ఏపీఎంగా బాధ్యతలు అప్పగించారు. ఆయన మాట్లాడుతూ మండల సమాఖ్య సభ్యుల అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. రొంపిచెర్ల మండలంలో జిల్లాలో ముందంజలో ఉండేందుకు సీసీలు, సంఘమిత్రలు కృషిచేయాలని సూచించారు.

రిటైర్డ్ ఎంపీడీఓకు సత్కారం



శివప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న నేతలు

చౌడేపల్లె: చౌడేపల్లె ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన శివప్రసాద్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ దంపతులను సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు సత్కరించారు. నేతలు గువ్వల రమేష్‌రెడ్డి, ప్రదీప్‌రాజు, రామచంద్ర, విజయ్‌భాస్కర్‌రెడ్డి, చిన్నరెడ్డెప్ప, బాబూనాయుడు, సుబ్బు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు అందుబాటులో జెడ్పీ చైర్మన్

వి.కోట: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు నేడు అందుబాటులో ఉంటున్నట్లు జెడ్పీ చైర్మన్ క్యాంపు కార్యాలయం సిబ్బంది బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అందుబాటులో ఉంటారని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డ్ సభ్యులు, ప్రజలు తమ సమస్యలు విన్నవించుకోవచ్చని ప్రకటనలో పేర్కొన్నారు.

75 ఫిర్యాదుల్లో 63 పరిష్కరించాం

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో రెండు నెలల పాటు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 75 ఫిర్యాదు రాగా, అందులో 63 ఫిర్యాదులను పరిష్కరించినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులరావు తెలిపారు. సీఎం పర్యటనలో, జిల్లా కలెక్టర్, ఉడా ప్రాజెక్టు డైరెక్టర్ ద్వారా కుప్పం మున్సిపాలిటీ పరిధిలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించామని పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలో 12 ఫిర్యాదులు ఆర్థిక పరమైనవి కావడంతో పెండింగ్‌లో ఉన్నట్లు ఆయన తెలిపారు.

హుండీ ఆదాయం రూ.4,12లక్షలు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని టీఎస్ అగ్రహారంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాల సందర్భంగా భక్తులు హుండీలో వేసిన కానుకలను బుధవారం ఆలయంలో లెక్కించారు. లెక్కింపులో రూ.4.12లక్షల నగదు కానుకల రూపంలో భక్తులు వేసినట్లు ఆలయ ఈఓ కమలాకర్ తెలిపారు. లెక్కింపులో అర్చకులు, ఆలయ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు పుస్తకాలేవీ..?

- పిల్లలు చదువులు సాగేదెలా?
- పాత పుస్తకాలతోనే బోధనలు



బైరెడ్డిపల్లె-2 అంగన్‌వాడీ కేంద్రంలో విద్యాబోధన చేస్తున్న టీచర్

బైరెడ్డిపల్లె: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేది అంతా పేదపిల్లలే. 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకోవడానికి వస్తారు. బాల్య దశలో విజ్ఞానం పెంపొందించడంతోపాటు ఆంగ్ల మాధ్యమంలో చిన్నారులు పట్టు సాధించేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతోకూడిన బొమ్మల పుస్తకాలు ఆయా కేంద్రాలకు అందజేసేది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆంగ్లం బోధించాలి. బాల్యం నుంచి వారిని ఆంగ్ల విద్యలో మంచి పరిజ్ఞానం సాధించేలా చేయాలనే ఉద్దేశంతోనే నాలుగు పుస్తకాలతో కూడిన బడ్స్–1, బడ్స్–2 కిట్లు అందించింది. వీటితో అంగన్‌వాడీల్లో ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్‌లా ఇంగ్లిషులో పాఠాలు బోధిస్తుంటే కేంద్రాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. బైరెడ్డిపల్లె మండల పరిధిలో 73 అంగన్‌వాడీ, మినీ కేంద్రాలు ఉన్నాయి. అందులో 1,590 మంది చిన్నారులు ఉన్నారు.

పాతపుస్తకాలతోనే బోధన..

అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న పిల్లలకు ప్రస్తుతం పీపీ–1, పీపీ–2 పుస్తకాలు అందకపోవడంతో పిల్లలకు పాత పుస్తకాలతోనే బోధిస్తున్నారు. గత సంవత్సరం మిగిలిన పుస్తకాలతో కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు బోధిస్తున్నారు. విద్యా సంవత్సరం మొదలై రెండు నెలలు కావస్తున్నా ప్రభుత్వం ఇంకా పుస్తకాలు అందించలేదు. ఇప్పటికే చాలా మంది తల్లితండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించడంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరే చిన్నారుల సంఖ్య తగ్గిపోతోంది. ఇటువంటి తరుణంలో పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరే విధంగా వారికి అవసరమైన వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవడం లేదు. పీపీ–1, పీపీ–2 కిట్లలో ఉన్న పుస్తకాల్లో పిల్లలకు ఎంతగానో ఉపయోగపడే పాఠ్యాంశాలు ఉన్నాయి. గత ప్రభుత్వం సకాలంలో పుస్తకాలు అందించడంతో పాటు వాటిలో చిన్నారులకు ఎంతో ఉపయోగపడే పాఠ్యాంశాలు ఉండడంతో తల్లితండ్రులు విధిగా అంగన్‌వాడీ కేంద్రాలకు తమ చిన్నారులను పంపించేవారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని సదుపాయాలతో పాటు పాఠ్యపుస్తకాలు అందించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో అంగన్‌వాడీలకు తమ చిన్నారులను పంపించేందుకు తల్లితండ్రులు ఆసక్తి చూపించకపోవడం గమనార్హం.

విద్యాబోధనకు ఇబ్బంది లేదు..

అంగన్‌వాడీల్లో చిన్నారుల విద్యాబోధనలకు ఎలాంటి ఇబ్బంది లేదు. ప్రస్తుతం మా వద్ద ఉన్న పాఠ్యపుస్తకాలు విద్యాబోధనలకు సరిపోతున్నాయి. కొత్త పుస్తకాలు త్వరలోనే వస్తాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యాబోధనా విధానాన్ని ప్రతిరోజూ టైమ్‌టేబుల్‌గా అన్ని కేంద్రాలకు పంపిస్తున్నాం. ప్రభుత్వం నుంచి పుస్తకాలు రాగానే అందజేస్తాం.

–మాధవిలత, సీడీపీఓ

కోర్టు తీర్పు మేరకే పరిష్కారం

- ఆర్డీఓ మనోజ్‌కుమార్‌రెడ్డి



ఉబేదుల్లా కాంపౌండు రోడ్డును పరిశీలిస్తున్న ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్

పుంగనూరు: పట్టణంలో జమీందారుల కాలంలో ఏర్పాటు చేసిన ఉబేదుల్లా కాంపౌండు రోడ్డుకు ఎలాంటి పరిహారం ఇవ్వాలన్న న్యాయస్థానం తీర్పు మేరకు కట్టుబడి ఉంటామని పలమనేరు ఆర్డీఓ మనోజ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని యూబీ కాంపౌండు రోడ్డును కమిషనర్ నరసింహప్రసాద్, తహసీల్దార్ శివయ్యతో కలసి రోడ్డు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు తమదంటూ పట్టణానికి చెందిన పబ్బత్తి ఉష అనే మహిళ గతవారం మదనపల్లెలో రెవెన్యూ కార్యదర్శి సిసోడియాను కలసి ఫిర్యాదు చేసింది. దీనిపై ఆర్డీవో విచారణ చేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ 40 సంవత్సరాలకు పైగా ఉన్న రోడ్డులో అధికారులు సిమెంటు రోడ్డు వేశారని, ఈ విషయమై కోర్టులో కేసు ఉన్నందున కోర్టు తీర్పు మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న లక్ష్మీప్రసన్న

వి.కోట: మామిడి తోటల పెంపకంలో కోతల అనంతరం యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల ఉద్యానవనశాఖాధికారిణి లక్ష్మి ప్రసన్న సూచించారు. బుధవారం కొత్తకోట గ్రామంలో మామిడి తోటల్లో కోతల అనంతరం కొమ్మల కత్తిరింపుపై రైతుభరోసా కేంద్రం సిబ్బందితోపాటు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మామిడి చెట్లలో అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మలు, ఎండిన కొమ్మలను కత్తిరించడమేకాక, చెట్టు మధ్యలో నిటారుగా, ఏపుగా పెరిగిన ఒక కొమ్మను కత్తిరిస్తే చెట్టుకు ఎండ బాగా తగులుతుందన్నారు. కత్తిరింపు తర్వాత తోటను ఒకసారి దున్నాలన్నారు. ఇలా దున్నడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకి తేమశాతం కొన్ని రోజులపాటు నిల్వ ఉంటుందని సూచించారు.

పుష్పపల్లకీపై సుబ్రహ్మణ్యస్వామి



సదుం: పుష్పపల్లకీపై విహరిస్తున్న స్వామివారు

సదుం: స్థానిక వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా బుధవారం పుష్పపల్లకీపై ఉత్సవ మూర్తులను ఘనంగా ఊరేగించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో మేళతాళాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు కర్పూర హారతులతో స్వామివారికి మొక్కులు చెల్లించారు.

వేల్ మురుగన్‌కు హరోహర

వి.కోట: పట్టణంలోని భారత్‌నగర్‌లో వేల్‌మురుగన్‌కు హరోహర అంటూ భక్తులు కావళ్లు ఎత్తి మొక్కులను తీర్చుకున్నారు. ఆడికృత్తిక సందర్భంగా పెద్ద సంఖ్యలో కావళ్లను బావుల వద్దకు తీసుకెళ్లి శుభ్రం చేసుకుని, అక్కడి నుంచి నీటి బిందెలతో ఊరేగింపుగా భజన కార్యక్రమాల మధ్య కావళ్ల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కావళ్లతో ఊరేగింపుగా సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో కావళ్లను చెల్లించారు.



బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

నీళ్ల కోసం ఆందోళన

పుంగనూరు: పట్టణంలోని టిడ్కో గృహాల వద్ద 15 రోజులుగా మంచినీరు రావడం లేదని మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. బుధవారం మధ్యాహ్నం టిడ్కో కాలనీ రోడ్డుపై మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. అలాగే రాంనగర్ కాలనీలో మంచినీటి సరఫరా చేయాలని, వీధి కాలువలు, రోడ్డు ఏర్పాటు చేయాలని ఆప్రాంత వాసులు కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన చేసి, కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. వెంటనే చర్యలు తీసుకుంటామని కమిషనర్ వారికి హామీ ఇచ్చారు.

కత్తెర పురుగు నివారణపై అవగాహన



కత్తెర పురుగును పరిశీలిస్తున్న గీతాకుమారి

బైరెడ్డిపల్లె: వరినారులో కత్తెర పురుగు ఎక్కువ అవుతున్న తరుణంలో బుధవారం వ్యవసాయశాఖాధికారిణి గీతాకుమారి అవగాహన కల్పించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో వరినారు పోసిన రైతులతో సంప్రదించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలోని రైతులు 128 ఎకరాల్లో వరినారు సిద్ధం చేసుకున్నారన్నారు. అయితే కొన్ని గ్రామాల్లో వరినారుకు కత్తెర పురుగు ఆశించి నష్టపరిచిందన్నారు. వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటిస్తే తప్పకుండా దిగుబడి బాగా వస్తుందన్నారు. రైతులు నిర్లక్ష్యం చేయకుండా కత్తెర పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

మున్సిపల్ ఉద్యోగికి సన్మానం



రెడ్డెమ్మను సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్

పుంగనూరు: మున్సిపల్ స్కావెంజర్‌గా పనిచేస్తూ బుధవారం ఉద్యోగ విరమణ చేసిన రెడ్డెమ్మను మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ సన్మానించి వీడ్కోలు పలికారు. సాయంత్రం మున్సిపల్ మీటింగ్ హాల్‌లో ఉద్యోగులు సమావేశమై ఆమె సేవలను కొనియాడారు. కమిషనర్ మాట్లాడుతూ రెడ్డెమ్మ ఎలాంటి విమర్శలకు తావులేకుండా విధులు నిర్వహించిందని కొనియాడారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య, మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణే ధ్యేయం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రముఖులు

గుడుపల్లె: నాణ్యమైన ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా పీఈఎస్ పనిచేస్తుందని గవర్నమెంట్ ఆఫ్ కాలేజ్ నర్సింగ్ కడప ప్రిన్సిపల్ కుమారి అన్నారు. బుధవారం పీఈఎస్ నర్సింగ్ కళాశాల 15వ స్నాతకోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ నర్సింగ్ వృత్తిలో అంకితభావంతో పనిచేయాలన్నారు. అనంతరం విద్యార్థినులకు పట్టాలను అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ హెచ్ఆర్ క్రిష్టారావు, సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, వైద్యులు అభిరామి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

తల్లి పాలతో శిశువుకు ఆరోగ్యం

- నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు
- అవగాహన కల్పించేందుకు అంగన్‌వాడీ సిబ్బంది సిద్ధం



సదుం: తల్లిపాల వారోత్సవాల ప్రచార చిత్రం

సదుం: శిశువుకు తల్లిపాలే శ్రేష్టమని నిపుణులు సూచిస్తున్నారు. వంద శాతం పోషక విలువలతో కూడిన తల్లిపాలు శిశువు ఆరోగ్యంగా ఎదగడంతో పాటు ఆయుష్షు పెంచడంలో ఎంతో ఉపయోగపడుతుందని వెల్లడిస్తున్నారు. దీనిని గుర్తించి ప్రతి ఏటా ప్రభుత్వం తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాల నిర్వహణకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

తల్లి పాలే కీలకం..

శిశువు జన్మించిన వెంటనే తల్లి బిడ్డకు తప్పనిసరిగా ముర్రుపాలు తాగించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆరు నెలల పాటు తల్లి పాలను మాత్రమే ఆహారంగా అందిస్తే బిడ్డకు తేలికగా జీర్ణం అవుతుందని చెప్పారు. వ్యాధులు సోకకుండా రక్షణగా ఉంటుందన్నారు. తల్లిపాలలో బిడ్డ పెరుగుదలకు అవసరమైన పోషకాలు లభిస్తాయని తెలిపారు. రెండేళ్ల వరకు తల్లిపాలను పట్టించాలని సూచించారు. కాన్పు అయిన కొద్ది రోజుల పాటు వచ్చే ముర్రుపాలలో ప్రోటీన్లు అధికంగా లభిస్తాయన్నారు. వీటికి రోగనిరోధక శక్తి ఉంటుందని, శిశువుల పెరుగుదలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

వారం రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు: తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఆగస్టు 1 నుంచి, 7 వరకు అంగన్‌వాడీల పరిధిలో ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని, ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మల్లీశ్వరి తెలిపారు.

తల్లిపాలతో అనేక ప్రయోజనాలు..

తల్లిపాలను బిడ్డకు తాగిస్తే అనేక ప్రయోజనాలు ఉంటాయి. రోగనిరోధక శక్తి పెరగడం, బిడ్డ పెరుగుదలకు ఉపయోగపడడంతో పాటు వారి మధ్య చక్కని అనుబంధం ఏర్పడుతుంది. డబ్బా పాలు తాగే వారికంటే తల్లిపాలు తీసుకునేవారు ఆరోగ్యంగా ఉంటారు. ప్రస్తుతం పలు కారణాలతో పలువురు తల్లులు పాలు ఇచ్చేందుకు సుముఖంగా లేరు. కానీ అది సరికాదు. పాలు ఇవ్వడం ద్వారా తల్లికి రొమ్ము క్యాన్సర్ రాకుండా ఉంటుంది.

–డాక్టర్ గిరీష్మా, చెరుకువారిపల్లె పీహెచ్‌సీ, సదుం

మున్సిపల్ సమావేశంలో చైర్మన్ నిర్వాకం

- వైస్ చైర్మన్ల కుర్చీల తొలగింపు
- వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు గైర్హాజర్
- 12 మంది సభ్యులతో తీర్మానాలు ఆమోదం



చైర్మన్ మాత్రమే నిర్వహిస్తున్న సమావేశం

పుంగనూరు: మున్సిపాలిటీ సాధారణ సమావేశంలో వైఎస్సార్‌సీపీతో చైర్మన్ పీఠం ఎక్కిన అలీమ్ బాషా టీడీపీలో చేరారు. బుధవారం జరిగిన మున్సిపల్ సమావేశంలో చైర్మన్ పక్కన వైస్ చైర్మన్లు ఇద్దరికి కుర్చీలు ఏర్పాటు చేసి సమావేశం నిర్వహించేశారు. మూడేళ్లుగా వస్తున్న సంప్రదాయాన్ని చైర్మన్ తొలగించి, వైస్ చైర్మన్లకు కుర్చీలు లేకుండా సభ్యుల వరుసన ఏర్పాటు చేసి, వైస్ చైర్మన్లను అవమానానికి గురి చేశారు. మున్సిపాలిటీ సమావేశాన్ని కమిషనర్ నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో చైర్మన్ అలీమ్‌బాషా నిర్వహించారు. సమావేశానికి 12 మంది మాత్రమే హాజరుకావడంతో అజెండాలోని అంశాలకు కోరం ఉన్నట్టు గుర్తించి, చైర్మన్ ఆమోదించారు. కాగా వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు 31 మంది, కోఆప్షన్ మెంబర్లు ముగ్గురు ఉన్నారు. చైర్మన్‌తో పాటు 11 మంది కౌన్సిలర్లు టీడీపీలో గత నెలలో చేరారు. అప్పటి నుంచి సమావేశాన్ని నిర్వహించలేదు. కాగా వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు 22 మంది రాకపోవడంతో హాజరైన 12 మంది సభ్యులతో తీర్మానాలను చైర్మన్ ఆమోదించారు. తీర్మానంలో మున్సిపాలిటీలో వేలం పాటలు నిర్వహించేందుకు ఆమోదం తెలిపారు. కాగా చైర్మన్ అధికార పార్టీలో చేరి వైస్ చైర్మన్లను అవమానించి కుర్చీలు తీసివేయడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.



హాజరైన 12 మంది కౌన్సిలర్లు

సూపర్ ఎన్నికలు జరిగేనా?

- ఎప్పుడైనా ఎన్నికలకు సిద్ధమేనంటున్న పాలకవర్గం
- ఈ దఫా రసకందాయకంగా మారనున్న ఎన్నిక
- ఏడేళ్లుగా సూపర్‌బజార్‌కు జరగని ఎన్నికలు



బాలజీ కోఆపరేటివ్ సూపర్‌బజార్

పలమనేరు: పలమనేరు బాలాజీ కో–ఆపరేటివ్ సూపర్ బజార్ ఎన్నికలను ఎప్పుడు నిర్వహిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. గత ఏడేళ్లుగా దీనికి వివిధ కారణాలతో ఎన్నికలు జరగని విషయం తెలిసిందే. ఇటీవల సాధారణ ఎన్నికలు పూర్తవడంతో త్వరలోనే ఈ ఎన్నికలను జరిపేందుకు రంగం సిద్ధమైందని సమాచారం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్‌బజార్‌లో అక్రమాలు జరుగుతున్నాయంటూ విచారణ జరిపించిన విషయం తెలసిందే. కానీ విచారణ అధికారి అలాంటివేమీ లేవని క్లీన్‌చిట్ ఇచ్చారు. మరోవైపు పాలకవర్గం సైతం తాము ఎన్నికలకు సిద్ధమేనని ప్రకటించింది. దీంతో కూటమి నేతలు ఎన్నికలను జరిపించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఇది సహకార శాఖకు సంబంధించిన విషయం కావడంతో ప్రభుత్వం నుంచి ఆదేశాలందాకే ఎన్నికల ప్రక్రియ జరిగే అవకాశం ఉంటుంది.

సూపర్‌బజార్ ఎన్నికలకు భలే క్రేజ్..

45 ఏళ్లకు ముందు ఏర్పాటు చేసిన సూపర్‌బజార్‌కు పట్టణానికే చెందిన సుభాష్‌చంద్రబోస్ అధ్యక్షుడిగా 38 ఏళ్ల నుంచి కొనసాగుతున్నారు. ఇందులో 14 వేలమంది దాకా ఓటర్లున్నారు. ఇక్కడ సూపర్‌బజార్‌కు జరిగే సహకార ఎన్నికలు సైతం సాధారణ ఎన్నికలను తలపించేలా సాగుతాయి. అందుకే నియోజకవర్గంలో సూపర్‌బజార్ ఎన్నికలకు భలే క్రేజుంది. దానికి తోడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎన్నికలు మరింత ఆసక్తికరంగా మారనున్నాయి. ఇక ఇప్పటికే వరుసగా గెలుపొందుతున్న సుభాషచంద్రబోస్ సైతం ఎన్నికల బరిలో ఉండే అవకాశాలు ఖచ్చితంగా కనిపిస్తున్నాయి. సహకారం రంగంలో నడపబడుతున్న సూపర్‌బజార్ సేవల్లోనూ, టర్నోవర్, లాభాల్లోనూ రాష్ట్రంలోనే నంబర్ 1గా ఉంది. దీంతో ప్రజలు సైతం సూపర్ ఎన్నికల కోసం ఉత్కంటగా ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడి వనరుల సంరక్షణ అందరి బాధ్యత



సూచనలిస్తున్న ఏపీఓ

చౌడేపల్లె: ఉమ్మడి వనరుల సంరక్షణ అందరి బాధ్యత అని ఉపాధి హామీ ఏపీఓ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో మండలస్థాయి ఉమ్మడి అభివృద్ధి సమావేశాన్ని కమిటీ అధ్యక్షుడు జి.ప్రభాకర్, కో–ఆర్డినేటర్ హసీనా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏపీఓ మాట్లాడుతూ ఉమ్మడి వనరుల పునరుద్ధరణకు చేసే పనులకు ఉపాధి పథకం గొప్ప వరమన్నారు. రైతుల పొలాల్లో భూ అభివృద్ధి పనులు, కొండలు, చెరువుల కట్ట బలంపరుచుట, పూడికతీత, శ్మశాన వాటికల్లో మౌలిక వసతుల కల్పన, పశువుల మేత భూముల్లో పశుగ్రాసాన్ని పెంచి భూమి కోతను నివారించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పీఓబీ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి డిమార్కేషన్‌పై శిక్షణ ఇచ్చారు. పశువైద్యాధికారి పవన్‌కుమార్, ట్రైనర్ తల్లా శ్రీనివాస్, జేఈ ధనుంజయుడు, రైతులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పంట రక్షణతో అధిక దిగుబడి

- జిల్లా రిసోర్స్ సెంటర్ ఏడీఏ నాగపద్మిని



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ నాగపద్మిని

గంగవరం: పంటల రక్షణతో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా రిసోర్స్ సెంటర్ ఏడీఏ నాగపద్మిని తెలిపారు. బుధవారం ఆమె మండలంలోని పత్తికొండ ఆర్బీకేలో భూసార పరీక్షల ప్రాముఖ్యతను రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షను అనుసరించి ఎరువులు వాడకం వలన పంటలను రక్షించడమే కాకుండా అధిక దిగుబడి పొందవచ్చని తెలిపారు. రైతులు వేసే ప్రతి పంటకు ముందుగా విత్తనశుద్ధి చేసి పంట చుట్టూ కంచె పంటగా జొన్న, సజ్జ పంటలు వేసుకోవాలన్నారు. దీంతో చీడపీడల బాధను తగ్గించి పంటలు ఏపుగా పండేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈవిధంగా ప్రతి పంటను జాగ్రత్తగా కాపాడుకున్నట్లయితే అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. ఏఓ హేమలత, వీఏఏ మనీషా, రైతులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ గిరి కోసం ఎదురుచూపులు!

- ఇప్పటికే పలు టీడీపీ ఆశావహుల ప్రయత్నాలు
- అమరన్న అనుగ్రహం ఎవరికో



పలమనేరు ఏఎంసీ కార్యాలయం

పలమనేరు: నియోజకవర్గంలో ఎమ్మెల్యే తర్వాత ప్రొటోకాల్ ఉన్న పోస్టు మార్కెట్ కమిటీ చైర్మన్. ఏఎంసీ చైర్మన్‌కు అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ వ్యవహారాల్లో సముచిత స్థానం ఉంటుంది. దీంతో తాజాగా కూటమి అధికారంలోకి వచ్చాక నియోజకవర్గ నాయకుల కన్ను చైర్మన్ కుర్చీపై పడింది. ఇందుకు సంబంధించి నియామకం త్వరలో జరగనున్న నేపథ్యంలో నేతలు వారివారి ప్రయత్నాల్లో ఉన్నారు. ఇక్కడ ఏఎంసీ చైర్మన్‌గా ఉన్న వైఎస్సార్‌సీపీ నేతలు హేమంత్‌కుమార్‌రెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో అధికార పార్టీ ఈ పోస్టును భర్తీ చేయనుంది. ఇందుకోసం 20మంది దాకా ఆశావహులు బరిలో ఉన్నట్టు సమాచారం. ఆయా వర్గాల నేతలు సైతం దీనిపై అంచనాలు వేసుకుంటున్నారు. మొన్నటి ఎన్నికల్లో కూటమి విజయంలో బీసీలే కీలకం కాబట్టి నామినేటెడ్ పోస్టుల్లో బీసీ నాయకులకు ప్రాముఖ్యత నివ్వాలని బీసీ నేతల అభిప్రాయంగా ఉంది. ఎస్సీలకు చైర్మన్ పదవినిస్తే బాగుంటుందని ఎస్సీ నేతలు అభిప్రాయపడుతున్నారు. కచ్చితంగా రెడ్లకు ఇవ్వాల్సిందేనని ఆ పార్టీలోనే కొందరు భావిస్తున్నారు. మరోవైపు కమ్మ సామాజిక వర్గానికి చెందిన ఓ సీనియర్ నేత ఇప్పటికే ముఖ్యమంత్రికి లిఖిత పూర్వకంగా దరఖాస్తు సైతం చేసుకున్నట్టు సమాచారం. ఇటీవల చంద్రబాబు కుప్పానికి వచ్చినప్పుడు కొందరు ఆయనకే అర్జీలిచ్చినట్టు సమాచారం.

నామినేటెడ్ పోస్టుల్లో ఏఎంసీకే ఎక్కువ డిమాండ్..

నియోజకవర్గంలో పీఏసీఎస్‌లకు ఎన్నికలు జరక్కుంటే కూటమికి చెందిన నాయకులు ఆయా మండలాల్లోని సింగిల్ విండోలకు కమిటీల పేరిట నియమించే అవకాశం ఉంది. ఇక పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి కార్యవర్గం ఎంపిక చేయాల్సి ఉంది. పలు ఆలయాలకు పాలకమండలి సభ్యులు భర్తీ చేయాల్సి ఉంది. అయితే పలువురి కన్ను మాత్రం ఏఎంసీ కుర్చీపైనే ఉండడం గమనార్హం. అయితే కీలకమైన ఈ పదవిని అన్ని అర్హతలుండి, పార్టీ కోసం కష్టపడిన వారికే ఇవ్వాలని మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి ఉన్నట్టు సమాచారం. ఆయన అనుగ్రహం ఎవరికి ఉందో మాత్రం ఇప్పటికీ బయటపడకపోవడం కొసమెరుపు.